ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5

తమిళనాడు
TAMILNADU
సోమవారం 26 ఆగస్టు 2024

రేపే స్టాలిన్ అమెరికా పయనం

● అంతర్జాతీయ పెట్టుబడుల సమీకరణే లక్ష్యం



అడయార్, ఆగస్టు 25: తమిళనాడు రాష్ట్రానికి అంతర్జాతీయ పెట్టుబడుల సమీకరణే లక్ష్యంగా సీఎం స్టాలిన్ మంగళవారం నుంచి విదేశీ పర్యటనకు వెళ్తున్నారు. ఈ పర్యటనలో ఆయన ప్రపంచంలోని బడా పారిశ్రామికవేత్తలను కలుసుకుని, రాష్ట్రంలో పరిశ్రలమ స్థాపనకు, పెట్టుబడుల పెట్టేందుకు ఉన్న అవకాశాలను వివరించనున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రాన్ని ఆర్థిక రంగంలో పటిష్ఠం చేసే దిశగా అనేక రకాలైన చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా 2030 నాటికి రాష్ట్ర ఆర్థికాభివృద్ధి ట్రిలియన్ డాలర్లకు చేర్చేలా ఆయన దృష్టిసారించారు. ఇందులోభాగంగా, దుబాయ్, అబుదాబీ, సింగపూర్, జపాన్, స్పెయిన్ వంటి దేశాల్లో పర్యటించి పారిశ్రామికవేత్తలను కలుసుకుని రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ఇపుడు మరోమారు ఆయన ఈనెల 27న మంగళవారం నుంచి విదేశీ పర్యటనకు వెళుతున్నారు. ఈ పర్యటన దాదాపు 17 దేశాల్లో కొనసాగనుంది. ఈ పర్యటనలో భాగంగా అమెరికాలో అడుగుపెట్టే ఆయనకు ఆ దేశంలో నివశించే తమిళ ప్రజలు ఘనంగా స్వాగతం పలుకనున్నారు. ఈ పర్యనటలో భాగంగా, ఈ నెల 28వ తేదీ నుంచి సెప్టెంబరు 2వ తేదీ వరకు శాన్‌ఫ్రాన్సిస్కోలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశమవుతారు. ఇందులో 29న శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగే ఇన్వెస్టర్స్ కాంక్లేవ్‌లో ఆయన పాల్గొని ప్రసంగిస్తారు. ఈనెల 31న తమిళ ప్రముఖులతో భేటీ అవుతారు. సెప్టెంబరు 2న శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి పది రోజుల పాటు అమెరికాలోని పలు బడా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులతో సమావేశమవుతారు. ప్రధానంగా అంతర్జాతీయ స్థాయిలో ఫార్చ్యూన్ 500 కంపెనీలకు చెందిన సీఈవోలతో ఆయన భేటీ కానున్నారు. ఈ సమావేశాల సమయంలోనే సెప్టెంబరు 7న ప్రవాస తమిళులు నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సెప్టెంబరు 12న ఆయన చెన్నైకి చేరుకోనున్నారు. ఈ పర్యటనలో సీఎంతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి తంగం తెన్నరసు, పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ ముఖ్య శాఖలకు చెందిన కార్యదర్శులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు వెళ్లనున్నారు.





ఆధ్యాత్మిక ప్రవచనకర్త సుకి శివంకు జ్ఞాపికను అందిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు - విదేశీ ప్రతినిధులను సత్కరిస్తున్న మంత్రి

ముగిసిన ముత్తమిళ్ మురుగన్ మహానాడు

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం మురుగప్పెరుమాన్ తృతీయ క్షేత్రం పళనిలో రెండు రోజులపాటు నిర్వహించిన ప్రపంచ ముత్తమిళ్ మురుగన్ మహానాడు ఆదివారం రాత్రి ముగిసింది. పళనియాండవర్ ఆర్ట్స్ కళాశాల మైదానంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల ఆధ్యాత్మిక మహానాడును చెన్నై నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం ఉదయం ప్రారంభించిన విషయం విదితమే. మంత్రులు పీకే శేఖర్‌బాబు, పెరియసామి, చక్రపాణి, వివిధ మఠాధిపతులు, ఆధీనాలు, న్యాయమూర్తులు, ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు, వేద పండితులు ఈ మహానాడులో పాల్గొన్నారు. జపాన్, జర్మనీ, ఆస్ట్రేలియా, మలేసియా, సింగపూర్, స్విట్జర్లాండ్ తదితర దేశాలకు చెందిన సుమారు 300 మంది ప్రతినిధులు ఈ మహానాడుకు విచ్చేశారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కీర్తి ప్రతిష్టతలను లోకానికి ఎలుగెత్తి చాటే రీతిలో ఈ రెండు రోజుల మహానాడు జరిగిందనడంలో అతిశయోక్తి కాదు.

దేశవిదేశాల నుంచి విచ్చేసిన ప్రతినిధులు ప్రసంగాలన్నీ ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లాయి. ఈ మహానాడు ప్రాంగణం వద్ద త్రీడీ గానమందిరం, ప్రత్యేక ఫొటో ప్రదర్శనను నిర్వహించారు. గుహాలయం వంటి హాలులో ఏర్పాటైన ఈ ప్రదర్శనను భక్తులంతా ఆసక్తిగా తిలకించారు. ప్రధాన వేదికపై మహానాడు కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగ కార్యక్రమాలు, వివాదవేదికలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య కార్యక్రమాలు వరుసగా నిర్వహించారు. తొలిరోజు మహానాడులో దేశవిదేశాల నుండి విచ్చేసిన ప్రతినిధులు 300 పరిశోధన పత్రాలను సమర్పించారు. ఆదివారం 800 పరిశోధన పత్రాలను సమర్పించారు. మొత్తం 1300 పరిశోధన పత్రాలు ఈ మహానాడులో సమర్పించినట్లు మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. ఈ పరిశోధన పత్రాలను సమర్పించినవారికి న్యాయమూర్తి సురేష్‌కుమార్ ప్రశంసాపత్రాలను అందజేశారు.



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన కళాకారులతో మహానాడు నిర్వాహకులు

మైమరపించిన సంగీత విభావరి...

రెండో రోజు మహానాడు ఆదివారం ఉదయం తిరువేల్ ఇరైవన్ తీంతమిళర్ సంగీత కార్యక్రమంతో ప్రారంభమైంది. ఆ తర్వాత మురుగన్ - భరతం అనే అంశంపై విద్యావాణి సురేష్, మహితా సురేష్ సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇసై తెండ్రల్ సంబంధం గురుకుల్ తిరుప్పుగళ్ లలిత సంగీత కార్యక్రమం, దివంగత తమిళ సినీ నేపథ్యగాయకుడు టీఎం సౌందరరాజన్ కుమారుడు బాల్‌రాజ్ 'ఇరైవణక్కమ్' పేరుతో భక్తి సంగీత విభావరి కార్యక్రమం సభికులను మైమరపించింది. దిండుగల్ జిల్లా కలెక్టర్ పూంగొడి స్వాగతోపన్యాసం చేశారు. మంత్రి చక్రపాణి ప్రారంభోపన్యాసం చేశారు. కోయంబత్తూరు కౌమారమఠం కుమరగురు స్వామి ఆశీర్వచనాలు అందించారు. సత్యవేల్ మురుగనార్ ప్రత్యేక సందేశమిచ్చారు. ఆ తర్వాత మారిషస్ తమిళ ఆలయాల సమాఖ్య అధ్యక్షుడు సెంగణ్‌కుమార్ అభినందన సందేశమిచ్చారు. న్యాయమూర్తి సురేష్‌కుమార్ ప్రత్యేక ప్రసంగం చేశారు. అటుపిమ్మట కళైమామణి దేశ మంగయర్క్కరసి, సుచిత్రా బాల సుబ్రమణ్యం బృందం 'యామిరుక్క భయమేన్' అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కర్ణాటక సంగీత గాయని నిత్యశ్రీ మహాదేవన్ బృందం 'మురుగనై కాణ ఆయిరమ్ కణ్ వేండుమ్' పేరుతో సంగీత కచేరి నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఆచార్య శివా బృందం కందన్ కావడి సింధు సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరువారూరు సురుట్టి సుర్జిత్ జానపద సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండో రోజు మహానాడులో పాల్గొనేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులందరికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి రుచికరమైన విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

ఈ మహానాడుకు విదేశాల నుండి వచ్చిన ప్రతినిధులు, భక్త సంఘాల నిర్వాహకులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హాలులో భోజన సదుపాయాలు కల్పించారు. రాత్రి 7గంటలకు మహానాడు ముగింపు సమావేశం జరిగింది. ఈ మహానాడులో అత్యుత్తమ పరిశోధన పత్రాలు సమర్పించిన ఆధ్యాత్మిక ప్రముఖులకు న్యాయమూర్తి వేల్‌మురుగన్ బిరుదులను ప్రదానం చేశారు. ఆ తర్వాత ప్రత్యేక తీర్మానాలను ప్రతిపాదించి ఆమోదించారు. తిరువాడుదురై ఆధీనం అంబళవాన దేశిక పరమాచార్య స్వామి ఆశీర్వచనాలు అందజేశారు. హిందూ దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ సుకుమార్ వందన సమర్పణతో ఈ మహానాడు ముగిసింది.

30వ తేదీ వరకు ఎగ్జిబిషన్...

మహానాడు ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, ఫోటోల ప్రదర్శనను తిలకించేందుకు వేల సంఖ్యలో బారులు తీరుతుండటంతో ఈ ప్రదర్శనను ఈ నెల 30 వరకు కొనసాగిస్తున్నట్టు మహానాడు నిర్వాహకులు ప్రకటించారు. ఈ మహానాడు ముగింపు సందర్భంగా మంత్రి పీకే శేఖర్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ... డీఎంకే అధికారంలోకి వచ్చి 39 నెలలు ముగిసిన నేపథ్యంలో దేవాదాయ శాఖ చరిత్రలో మునుపెన్నడూ లేనంతగా వేల సంఖ్యలో ఆలయాలకు జీర్ణోద్ధరణ పనులు నిర్వహించినట్లు తెలిపారు. ఫ్రిబవరి 27న సీఎం స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 10 తీర్మానాలు చేశామని, అందులో ముఖ్యమైన తీర్మానంగా ముత్తమిళ్ మురుగన్ మహానాడును నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఈ మహానాడు నిర్వహణపై రాజకీయ రంగు పులమటం తగదన్నారు. ఈ మహానాడులో ప్రపంచం నలుమూలల నుండి తమిళుల ఆరాధ్యదైవం మురుగన్‌ను అనునిత్యం ఆరాధించే భక్తులు, ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. నలుగురు న్యాయమూర్తులు, రాష్ట్రంలోని అన్ని మఠాధిపతులు, ప్రవచనకర్తలు, సంగీత విద్వాంసులు, కళాకారులు కూడా పాల్గొన్నారని చెప్పారు.

కష్టపడకుండా పదవిలోకి వచ్చిన అన్నామలై!

● ఈపీఎస్ ధ్వజం

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కష్టపడకుండానే, పార్టీకి యేళ్ల తరబడి సేవలందించకుండానే ఆ పదవిలోకి వచ్చారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ధ్వజమెత్తారు. సేలం జిల్లా ఓమలూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉదయం అన్నాడీఎంకే న్యాయవాదుల విభాగం సమావేశం జరిగింది. ఈ సమావేశం ముగిసిన తర్వాత ఈపీఎస్ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి నాణెం ఆవిష్కరణ సభలో బీజేపీకి చెందిన కేంద్రమంత్రులు, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పాల్గొనటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. గత మూడేళ్లుగా అవినీతిలో కూరుకుపోయిన డీఎంకే ప్రభుత్వానికి ప్రస్తుతం కేంద్రంలోని పాలకుల సాయం కావాల్సి వచ్చిందని, కనుకనే నాణెం ఆవిష్కరణ సభకు ఇండియా కూటమికి చెందిన నాయకులెవరినీ ఆహ్వానించకుండా, కేంద్రమంత్రులను ఆహ్వానించిందని ఆరోపించారు. ఆ నాణెం ఆవిష్కరణ కంటే ముందు గవర్నర్ తేనీటి విందులో ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు చివరి క్షణంలో పాల్గొన్నప్పుడే బీజేపీ, డీఎంకే మధ్య రహస్య పొత్తు కుదురిందనే అనుమానాలు అన్ని పార్టీల నేతలకు కలిగాయన్నారు. ఎంజీఆర్ నాణేన్ని అన్నాడీఎంకే ఆధ్వర్యంలో తానే ఆవిష్కరించడంపై బీజేపీ నాయకులు, డీఎంకే నాయకులు అదే పనిగా తప్పుబట్టుడుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై 1984లో జన్మించారని, ఆయనకు ఎంజీఆర్ గురించి ఏవీ తెలియదన్నారు. ప్రస్తుతం అన్నాడీఎంకేని అవినీతి పార్టీగా చెబుతున్న అన్నామలైకి తమతో ఎన్నికల పొత్తుకుదుర్చుకున్నపుడు తెలియలేదా అని ఈపీఎస్ ప్రశ్నించారు. అన్నాడీఎంకే ప్రాంతీయ పార్టీగా ఉన్నప్పటికీ రాష్ట్ర హక్కుల కోసం అలుపెరగని పోరాటం సాగిస్తుందని, డీఎంకేలాగా అవినీతి నుంచి తప్పించుకునేందుకు కేంద్రంలోని బీజేపీ పాలకులతో రహస్య పొత్తు కుదుర్చుకోదని ఈపీఎస్ అన్నారు.

'నమ్మ మెరీనా - నమ్మ పెరుమై'

● అవగాహన ఉద్యమాన్ని ప్రారంభించిన ఉదయనిధి

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మెరీనా బీచ్‌ను సందర్శకులకు అనువుగా సర్వాంగసుందరం తీర్చిదిద్దేలా సరికొత్తగా 'నమ్మ మెరీనా.. నమ్మ పెరుమై' (మన మెరీనా... మన ఘనత) పేరుతో అవగాహన ప్రచారోద్యమాన్ని రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడా శాఖల మంత్రి ఉదయనిధి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ అధ్యక్షత వహించారు. ఇందులో భాగంగా మెరీనా, బీసెంట్‌నగర్ బీచ్‌లలో నేరాలను నిరోధించేందుకు అత్యంత ఆధునిక మోటరు వాహనాలు, నీటిలో పూడికతీసే రోబోటిక్ యంత్రాలు, బీచ్‌లో చెత్తాచెదారం, సీసాపెంకులను తొలగించే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. అదే సమయంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మాజీ ఉద్యోగుల వారసులకు కారుణ్య ప్రాతిపదికన 411 మందికి ఉద్యోగ నియమాక పత్రాలను అందించారు. ఆ తర్వాత మెరీనా బీచ్ అంతటా చెత్తాచెదారాన్ని విభజించి వేసే కుప్పతొట్టెలను పరిశీలించారు. అదే సమయంలో బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచాలంటూ అవగాహన ప్రచారం చేసిన 10 మంది చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. బీచ్‌లో నడిచే ఆల్ టెర్రయిన్ వెహికల్ -ఏటీవీ నాలుగు చక్రాల వాహనాన్ని, రూ.48లక్షలతో కొనుగోలు చేసిన మూడు గస్తీ వాహనాలను ఆయన ప్రారంభించారు. ఇదే విధంగా పూడికతీయడానికి రోబోటిక్ మల్టీ పర్పస్ ఎక్స్‌కవేటర్లను కూడా నడిపారు. ఈ సందర్భంగా మంత్రులు కేఎన్ నెహ్రూ, ఉదయనిధి మాట్లాడుతూ... మెరీనా, బీసెంట్‌నగర్ బీచ్‌లను సందర్శకులు ఆకట్టుకునే రీతిలో మరిన్ని సదుపాయాలు కల్పించనున్నామని, రెండు బీచ్‌లలోనూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చేలా చెత్తను తొలగించే యంత్రాలు, గస్తీ వాహనాలను ఉపయోగించనున్నామని తెలిపారు. రానున్న మూడు నెలల్లో ఈ అభివృద్ధి పనులన్నీ పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం, ఎంపీ దయానిధి మారన్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్ జే కుమార గురుబరన్ తదితరులు పాల్గొన్నారు.



మెరీనాబీచ్‌లో గస్తీకోసం కొనుగోలు చేసిన యంత్రాన్ని నడుపుతున్న మంత్రి ఉదయనిధి

ఘనంగా విజయకాంత్ జయంతి

● డీఎండీకే కార్యాలయంలో విగ్రహావిష్కరణ

ప్యారీస్, ఆగస్టు 25: డీఎండీకే వ్యవస్థాపకుడు, దివంగత కెప్టెన్ విజయకాంత్ 72వ జయంతి వేడుకలను ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. కోయంబేడులో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఉన్న విజయకాంత్ సమాధి వద్ద ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్, కుమారులు షణ్ముగ పాండ్యన్, విజయ్ ప్రభాకరన్, ఉప ప్రధాన కార్యదర్శులు సుధీష్, పార్థసారథి తదితరులు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం చిరునవ్వుతో అందంగా రూపొందించిన విజయకాంత్ నిలువెత్తు విగ్రహాన్ని ప్రేమలత కార్యకర్తల కరతాళధ్వనుల మధ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదానంలో వేలాది మంది పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ సభలో ప్రేమలత విజయకాంత్ మాట్లాడుతూ... డీఎండీకే ప్రధాన కార్యాలయం ఇక నుంచి 'కెప్టెన్ ఆలయం'గా పిలువబడుతుందని, కొత్తగా యూట్యూబ్ ఛానల్ కూడా ప్రారంభించినట్లు తెలిపారు. విజయకాంత్ మరణించిన రోజు నుంచి ప్రతిరోజు వేలాది మంది ప్రజలు ఆయన సమాధిని సందర్శించేందుకు వచ్చి వెళుతున్నారని, వారికి ఎనిమిది నెలలుగా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. యేటా విజయకాంత్ జయంతిని దారిద్ర్య నిర్మూలన దినంగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు జరుపుకుంటున్నారని, ఈ సందర్భంగా పేదలకు సంక్షేమ సహాయాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో, పార్టీ కార్యాలయానికి వేలాదిమంది కార్యకర్తలు తరలిరావడంతో నెలకొన్న రద్దీలో విజయకాంత్ చిన్న కుమారుడు షణ్ముగ పాండ్యన్ చిక్కుకొని స్పృహ కోల్పోయాడు. దీంతో ఆయనను కారులో ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా, విజయకాంత్ జయంతిని పురస్కరించుకొని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తన ఎక్స్ పేజీలో నివాళులర్పిస్తూ పోస్ట్ చేశారు. అలాగే, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమల్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సహా పలువురు రాజకీయ ప్రముఖులు తమ ఎక్స్ పేజీల ద్వారా నివాళులర్పించారు.



హాజరైన పార్టీ కార్యకర్తలు, అభిమానులు



సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుమారులు షణ్ముగ పాండ్యన్, విజయ్ ప్రభాకరన్‌తో ప్రేమలత

తెలుగు సాహితీ లోకం గర్వించదగ్గ మహాకవి తెనాలి రామకృష్ణ

● గన్నమరాజు గిరిజా మనోహరబాబు

వేళచ్చేరి, ఆగస్టు 25: 'తెలుగు సాహితీ ప్రపంచం గర్వించదగ్గ మహాకవి తెనాలి రామకృష్ణ కవి' అని గన్నమరాజు గిరిజా మనోహరబాబు కొనియాడారు. వేద విజ్ఞాన వేదిక ప్రతినెలా నిర్వహించే తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 152వ ప్రసంగంలో ఆయన వక్తగా పాల్గొన్నారు. స్థానిక టి.నగర్‌లోని ఆంధ్ర క్లబ్ కృష్ణా హాల్ ఈ కార్యక్రమానికి వేదిక అయింది. వేదిక కార్యదర్శి కందనూరు మధు స్వాగతోపన్యాసంతో సభ ప్రారంభమైంది. అరుణా శ్రీనాథ్ ప్రార్థనా గీతం ఆలపించారు. వక్తను వేద విజ్ఞాన వేదిక నిర్వాహకులు సత్కరించారు. వేదిక కార్యదర్శి మధు వక్తను సభకు పరిచయంగావిస్తూ... గన్నమరాజు గిరిజా మనోహరబాబు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేసి, ఉద్యోగ విరమణ చేశారని, రెండు తెలుగు రాష్ట్రాల్లో 800పైగా సాహిత్య, సాంస్కృతిక, సామాజిక అంశాలపై ప్రసంగాలు ఇచ్చారని, 80కి పైగా పరిశోధన పత్రాలు సమర్పించారని, వివిధ రేడియో కేంద్రాల నుంచి వీరి ప్రసంగాలు, వ్యాఖ్యానాలు మొదలైనవి డీడీ, ఎస్వీబీసీ, టీవీ9 మొదలైన దృశ్య మాధ్యమాల్లో ప్రసారమయ్యాయని, వివిధ సంచికలకు సంపాదకత్వం నెరిపారని వివరించారు. వరంగల్లులో 1996లో ప్రారంభమైన 'సహృదయ' సాహిత్య సాంస్కృతిక సంస్థకు ప్రస్తుతం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని, భారతి, స్రవంతి, ఆంధ్రజ్యోతి మొదలైన పత్రికలు ఆయన వ్యాసాలు ప్రచురించాయని, ఎన్నో సాహిత్య రూపకాల ప్రదర్శలలో ప్రముఖుల పాత్రలను ధరించారని తెలిపారు. సాహిత్యసుధ, శతక సమీరా, తెలుగులో శతక సాహిత్యం అక్షరధార మొదలైన ఎన్నో గ్రంథాలకు వీరు రచించారని, 'గిడుగు పురస్కారం', 'సీపీ బ్రౌన్ సాహిత్య పురస్కారం', దేవులపల్లి రామానుజరావు పురస్కారం' మొదలైన ఎన్నో పురస్కారాలు అందుకున్నారన్నారు. 'తెనాలి రామకృష్ణ కవి కవితావైభవం' అనే అంశంపై వక్త అనర్గళంగా ఉపన్యసించారు. 'వికటకవి'గా హాస్యకవిగా అందరికీ సుపరిచితమైన కవి తెనాలి రామలింగ కవి పాండురంగ మహాత్మ్యం, ఘటికాచల మాహాత్మ్యం రచించారని, ఈ గ్రంథాలు వీరి పాండిత్య ప్రతిభకు నిదర్శనాలని అన్నారు. రామకృష్ణ కవి శబ్దప్రయోగ నైపుణ్యానికి, పద్య నిర్మాణ పటుత్వానికి, పాత్ర చిత్రణలో కనబరచిన ప్రతిభకు కథాకథనంలోని నేర్పరితనానికి ఆయన రాసిన 'పాండురంగ మహాత్మ్యం' నిలువెత్తు సాక్ష్యమన్నారు. చాటు పద్యాలలోను, కావ్యాలలోను కూడా ఆయన హాస్యప్రియత్వం ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. రామకృష్ణుని రచనా వైఖరి అసామాన్యమని, తెలుగు సాహిత్యం ఉన్నంత కాలం రామకృష్ణ కవి రచనలు చిరస్థాయిగా నిలిచి ఉంటాయన్నారు కందనూరు మధు వందన సమర్పణ గావించారు. చెన్నై ఎస్కేపీడీ స్కూలు ఉపాధ్యాయుడిగా పదవీవిరమణ చేసిన వెలది సత్యనారాయణ రచించిన 'ఎద పలికిన మది భావనలు' అనే పుస్తకాన్ని ఈ సభలో ఆవిష్కరించారు. వారిని కూడా నిర్వాహకులు సత్కరించారు.



హాజరైన సాహితీ ప్రియులు



వక్తను సత్కరిస్తున్న కందనూరు మధు

సమాచార ధ్వని

28నుంచి 'గేట్' దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, ఆగస్టు 25: పోస్ట్ గ్యాడ్యుయేట్ ఇంజినీరింగ్ కోర్సుల్లో 2025వ విద్యా సంవత్సరం అడ్మిషన్లకు గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఈ పరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో పాఠ్యాంశాల వారీగా నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ఈనెల 28న ప్రారంభమై సెప్టెంబరు 26వ తేదీతో ముగియనుంది. విద్యార్థులు http://gate2025. iitr.ac.in/లో దరఖాస్తు చేసుకోవచ్చు.

రేపు పీఎఫ్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, ఆగస్టు 25: కార్మికుల భవిష్య నిధి సంస్థ స్థానిక వెస్ట్ మాంబళంలో ఉన్న లేక్ వ్యూ రోడ్డు ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పీఎఫ్ గ్రీవెన్స్ నిర్వహించనుందని చెన్నై మండల కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఈ శిబిరంలో పీఎఫ్ చందాదారులు, పింఛన్‌దారులు పాల్గొనాలని సూచించారు.

సీఎం ట్రోఫీ పేర్ల నమోదుకు అవకాశం

పెరంబూర్, ఆగస్టు 25: ముఖ్యమంత్రి ట్రోఫీలో పాల్గొనేందుకు పేర్ల నమోదుకు అవకాశం పొడిగించారు. ఈ మేరకు రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్ విడుదల చేసిన ప్రకటనలో... ఆన్‌లైన్‌లో పేరు నమోదు ఈ నెల 4వ తేది ప్రారంభమై 25వ తేదీతో ముగుస్తుందని ఇదివరకు ప్రకటించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు ఆసక్తి చూపుతుండడంతో సెప్టెంబరు 2వ తేది వరకు పేర్ల నమోదు గడువు పొడిగించామన్నారు. వివరాలకు నెం.9514000777లో పనిరోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చు.

రాష్ట్రంలో 73 శాతం అదనపు వర్షపాతం

పెరంబూర్, ఆగస్టు 25: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలతో 73 శాతం అదనపు వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది జూన్ నుంచి సరాసరిన 192.7 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 334 మి.మీ వర్షం కురిసింది. రుతుపవనాల సీజన్ మరో నెల ఉండడంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

రెండు విడతల్లో ప్రత్యేక అరియర్స్ పరీక్షలు

పెరంబూర్, ఆగస్టు 25: అన్నా విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో కోర్సులు ముగించి కొన్ని పాఠ్యాంశాల్లో ఉత్తీర్ణులు కాని వారికి ఈ నెల నవంబరు- డిసెంబరు, 2025 ఏప్రిల్-మే నెలల్లో ప్రత్యేక పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పరీక్షల నోటిఫికేషన్‌ను వర్శిటీ విడుదల చేసింది. నవంబరు-డిసెంబరులో నిర్వహించే ప్రత్యేక అరియర్ పరీక్షలు రాయగోరు విద్యార్థులు ఈనెల 30 నుంచి సెప్టెంబరు 18వ తేది వరకు https://coel.annauniv.eduలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రత్యేక పరీక్షా ఫీజు రూ.5,000గా నిర్ణయించారు. చెన్నై, విల్లుపురం, ఆరణి, సేలం, ఈరోడ్, కోవై, తిరుచ్చి, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్‌లల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

సౌందర్య సాధనాల తయారీపై శిక్షణ

ఐసిఎఫ్, ఆగస్టు 25: రాష్ట్రప్రభుత్వ పారిశ్రామికుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సౌందర్య సాధనాల తయారీపై శిక్షణ తరగతులు ఈనెల 28 నుంచి 30వ తేది వరకు జరగనున్నాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణలో టెన్త్ ఉత్తీర్ణులై 18 ఏళ్ల పైబడిన మహిళలు, పురుషులు పాల్గొనవచ్చు. నెం.7010143022లో సంప్రదించవచ్చు.

కీ విడుదల

ఐసిఎఫ్, ఆగస్టు 25: టెక్నికల్ పోస్టుల భర్తీకి నిర్వహించిన ఫస్ట్ పేపర్ పరీక్ష కీని టీఎన్‌పీఎస్సీ విడుదల చేసింది. ఈ పోస్టులకు ఈనెల 12, 19, 20, 21 తేదీల్లో ఆన్‌లైన్‌లో పరీక్షలు జరిగాయి. 12వ తేది మధ్యాహ్నం జరిగిన పేపర్-1లో తమిళ అర్హత పరీక్ష, జనరల్ నాలెడ్జి కీ విడుదలైంది. దీనిలో ఆక్షేపణలుంటే ఈనెల 30వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని టీఎన్‌పీఎస్సీ అధికారులు తెలిపారు.

కుక్, డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 25: స్థానిక పుళల్ సెంట్రల్ జైలులో కుక్, లారీ డ్రైవర్, చేనేత ఉపాధ్యాయులు వంటి పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. పుళల్ సెంట్రల్ జైలు-1లో ఒకటి, పొన్నేరి సబ్ జైళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులకు 18 నుంచి 35 ఏళ్లలోపున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. కుక్‌కు రూ.15,900 నుంచి రూ.58,500 వరకు వేతనం అందజేస్తారు. 8వ తరగతి ఉత్తీర్ణతతో పాటు రెండు సంవత్సరాలు వంట పనిలో అనుభవం ఉండాలి. డ్రైవర్ పోస్టులకు రూ.19,500 నుంచి రూ.71,900 వరకు వేతనం అందజేస్తారు. ఈ పోస్టులకు భారీ వాహన లైసెన్స్ కలిగి 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. చేనేత ఉపాధ్యాయులకు డ్రైవర్లకు అందజేసే వేతనాన్నే అందజేస్తారు. ఔత్సాహికులు సెప్టెంబరు 13వ తేది వరకు 'జైలు సూపరింటెండెంట్, సెంట్రల్ జైలు-1, పుళల్, చెన్నై-66' అనే చిరునామాకు దరఖాస్తులు పంపాలి. ఇతర వివరాలకు నెం. 04426590615లో సంప్రదించవచ్చు.

364 శునకాలకు కు.ని శస్త్రచికిత్సలు

ఐసిఎఫ్, ఆగస్టు 25: తాంబరం కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాల్లో 364 వీధి శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేసి రాబిస్ నిరోధక టీకాలు వేసినట్లు అధికారులు తెలిపారు. వీధి కుక్కల బెడదపై కార్పొరేషన్‌కు ప్రతిరోజు ఫిర్యాదులందుతున్నాయి, వాటి సంఖ్య నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. అనకాపుత్తూర్, భారతిపురం సహా పలు ప్రాంతాల్లో వీధి శునకాలు పట్టి శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

నేడు శనివారం టైంటేబుల్‌తో మెట్రోరైళ్లు

పెరంబూర్, ఆగస్టు 25: శ్రీకృష్ణ జయంతి సందర్భంగా సెలవు రోజు కావడంతో నగరంలో నడిచే మెట్రోరైళ్లు శనివారం టైం టేబుల్ ప్రకారం నడుస్తాయని సీఎంఆర్ఎల్ పేర్కొంది. సోమవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు 6 నిమిషాలకు ఒక రైలు, తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 8 గంటలు, 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 7 నిమిషాలకు ఒక రైలు, రాత్రి 10 నుంచి 11 గంటల వరకు 15 నిమిషాలకు ఒక రైలు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

నీట మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

పెరంబూర్, ఆగస్టు 25: తంజావూరు జిల్లా తిరువయ్యారు కావేరి నదిలో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. ప్లస్‌వన్ విద్యార్థి హరిప్రసాద్, 7వ తరగతి విద్యార్థి ప్రవీణ్ మడితురై సమీపంలోని కావేరి నదిలో స్నానం చేస్తూ ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది నదిలో గాలించి మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సాంస్కృతిక వారసత్వాన్ని పిల్లలకు అందించాలి

● 'బాలల సంస్కృతి పరిషత్' ప్రారంభం




బాలల సంస్కృతి పరిషత్ ప్రారంభిస్తున్న నిర్వాహకులు - ఏఎన్నార్ వేషధారణలో విద్యార్థి

పెరంబూర్, ఆగస్టు 25: పురాతన సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు తెలియజేయాలని వక్తలు పిలుపునిచ్చారు. రామాపురంలోని నారాయణి పాఠశాలలో 'బాలల సంస్కృతి పరిషత్' ప్రారంభం శనివారం జరిగింది. 1 నుంచి 5వ తరగతులకు చెందిన విద్యార్థులను తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ సహా 10 రాష్ట్రాలకు చెందిన బృందాలుగా విభజించారు. ఒక్కో బృందం ఆయా రాష్ట్రాల ఆచార, వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలను ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుమ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాశ్చాత్య ధోరణి రాకతో మన సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయని, వాటిని భావితరాలకు తెలియజేసేలా ఈ పరిషత్ ప్రారంభించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బృందంలో ఓ విద్యార్థి దివంగత తెలుగు సినీ హీరో అక్కినేని నాగేశ్వరరావు వేషధారణలో అందర్నీ ఆకట్టుకున్నాడు.

మతపరమైన పండుగల నిర్వహణ మానుకోవాలి

● రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఎం లేఖ

పెరంబూర్, ఆగస్టు 25: మతపరమైన పండుగలు జరపడం మానుకోవాలని రాష్ట్రప్రభుత్వానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం మతాలకు దూరంగా ఉండాలన్నది లౌకికవాద సిద్ధాంతమన్నారు. ఏ మతాన్ని వ్యాప్తిచేయడం, దాన్ని అనుసరించడం ప్రభుత్వ పని కారాదన్నారు. మతసామరస్యం, ప్రజలను ఐకమత్యంగా ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్నారు. హిందూ దేవాదాయ శాఖను నిర్వీర్యం చేయాలని ఆర్ఎస్ఎస్ - బీజేపీ అజెండాగా ఉందన్నారు. ఆలయాల ఆస్తులు దోచుకొనేందుకు, కులాలపరంగా ప్రజలను విభజించడం ఆర్ఎస్ఎస్ - బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. వీటిని అధిగమించేలా హిందూ దేవాదాయ శాఖ పనితీరు ఉండాలని బాలకృష్ణన్ సూచించారు.

అమరజీవి భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో 28న తెలుగు భాషా దినోత్సవం

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 28 ఉదయం తెలుగు భాషాదినోత్సవం నిర్వహించనున్నట్లు ఆ కమిటీ అధ్యక్షుడు కాకుటూరు అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. నిడమర్తి వసుంధరాదేవి ప్రార్థనతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జే.ఎం.నాయుడు స్వాగతోపన్యాసం చేయనున్నారు. భారతి మహిళా కళాశాల విశ్రాంత తెలుగు శాఖాధ్యక్షులు నిర్మలాపళనివేలు ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ కార్యక్రమంలో ఆకాశవాణి చెన్నై కేంద్ర విశాంత ఉద్ఘోషకురాలు బిత్రా గజగౌరి ప్రసంగించనున్నారు. కమిటీ సంయుక్త కార్యదర్శి పూరా శశికళ అతిథులను పరిచయం చేయనున్నారు. కమిటీ సభ్యురాలు డాక్టర్ ఏవీ శివకుమారి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారు. మరో సభ్యులు గుడిమెట్ల చెన్నై వందన సమర్పణ చేస్తారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు పేర్కొన్నారు.

త్వరలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

ఐసిఎఫ్, ఆగస్టు 25: కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలో అందజేయనున్నట్లు ఆహార సరఫరా శాఖ అధికారులు తెలిపారు. డీఎంకే అధికారంలోకి వచ్చిన అనంతరం ఇప్పటివరకు 15.94 లక్షల కొత్త రేషన్ కార్డుల పంపిణీ జరిగింది. మిచౌంగ్ తుఫాను బాధిత చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం చెంగల్పట్టు జిల్లాల్లో 17,197 కార్డులు గత ఏడాది డిసెంబరులో అందజేశారు. అలాగే, వరద బాధిత ప్రాంతాలైన తెన్‌కాశి, తిరునల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారి జిల్లాల్లో 10,380 కార్డులు పంపిణీ చేశారు. ఈ ఏడాది మార్చిలో 45,509 కార్డులు అందజేయగా, లోక్‌సభ ఎన్నికలతో దరఖాస్తుల పరిశీలనలో జాప్యం జరిగింది. ఇప్పటివరకు స్వీకరించిన 2.89 లక్షల దరఖాస్తుల్లో 1.63 లక్షల ఇళ్లలో విచారణ చేపట్టి 92,650 అర్హులుగా గుర్తించారు. వాటిలో 24,657 కార్డులు ముద్రించగా, మిగిలిన కార్డుల ముద్రణా పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయిన వెంటనే కొత్త కార్డులు అందిస్తామని అధికారులు తెలిపారు.

ఊపందుకున్న ఉసుళ్ల విక్రయాలు

ఐసిఎఫ్, ఆగస్టు 25: నగరం, శివారు ప్రాంతాల్లో ఉసుళ్ల విక్రయాలు ఊపందుకున్నాయి. చెంగల్పట్టు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆడి, ఆవణి, పురటాసి నెలల్లో ఉసుళ్లు ఎక్కువగా లభిస్తుంటాయి. పుట్టల నుంచి ఇవి వర్షాకాలాల్లో రాత్రి, సూర్యోదయం సమయాల్లో వెలుపలికి వస్తుంటాయి. ఎక్కువ పోషకాలు కలిగిన వీటిని చిరుతిండిగా ఆరగిస్తుంటారు. ఉసుళ్ల వ్యాపారులు మాట్లాడుతూ... రాత్రి సమయంలో పుట్టపైన వచ్చేట్టు ఆకులను పొడిచేసి వాటి సమయంలో దీపం, పాత్ర ఉంచితే అందులో వచ్చి పడతాయని, ఒక పడి ఉసుళ్లను రూ.200 వరకు విక్రయిస్తున్నామని పేర్కొన్నారు.

సహకార విక్రయ సంఘాల పరిశీలన



సహకార విక్రయ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మిజోరం రాష్ట్ర అధికారులు

పెరంబూర్, ఆగస్టు 25: నీలగిరి సహకార విక్రయ సంఘం నిర్వహణను మిజోరం రాష్ట్ర అధికారులు పరిశీలించారు. ఊటీ మార్కెట్లో పనిచేస్తున్న ఈ విక్రయ కేంద్రాన్ని మిజోరం రాష్ట్ర ఉద్యానవన శాఖ ప్రత్యేక కార్యదర్శి రామ్‌తిల్నేని నేతృత్వంలో అధికారులు బృందం శనివారం పరిశీలించింది. ఈ మార్కెట్‌కు సమీప గ్రామాలకు చెందిన రైతులు తీసుకొచ్చే కూరగాయల వేలం, రైతులకు నగదు అందించడం సహా పలు అంశాలను ఈ బృందం పరిశీలించింది. అనంతరం నీలగిరి జిల్లా సహకార సంఘాల జాయింట్ రిజిస్ట్రార్ దయాళన్‌ను సంప్రదించిన బృందం, సంఘ నిర్వహణ సహా పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సంఘాలను తమ రాష్ట్రంలో కూడా ప్రారంభించాలనే ఉద్దేశంతో తాము ఈ పర్యటన చేపట్టినట్లు అధికారి రామ్‌తిల్నేని తెలిపారు.

ఓమందూర్ రామస్వామి రెడ్డికి ఘననివాళి



రామస్వామి రెడ్డికి నివాళులర్పిస్తున్న సీఎంకే రెడ్డి తదితరులు

ప్యారీస్, ఆగస్టు 25: స్వాతంత్ర్యం అనంతరం మద్రాసు ప్రెసిడెన్సీ తొలి ముఖ్యమంత్రిగా వ్యవహరించిన ఓమందూర్ రామస్వామి రెడ్డి 54వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయనకు అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కీల్పాక్కంలోని కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఓమందూర్ రెడ్డి చిత్రపటానికి ఏఐటీఎఫ్ అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాయకర్ నందగోపాల్, డాక్టర్ ఎస్.నాగభూషణం సహా నిర్వాహకులు పూలు చల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎంకే రెడ్డి మాట్లాడుతూ... 1947 మార్చి 23న మద్రాసు ప్రెసిడెన్సీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఓమందూర్ రామస్వామి రెడ్డి 1949 ఏప్రిల్ 6వ తేది వరకు రెండేళ్లు సుపరిపాలన అందించి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. ముఖ్యంగా అవినీతి రహిత పాలన లక్ష్యంతో సహ మంత్రులను సైతం ఆడంబరాలకు దూరంగా ఉంచారని కీర్తించారు. హరిజనులు, దళితులు, ఆలయ ప్రవేశానికి కృషి చేసి విజయం సాధించారని, అలాగే దేవదాసీల సంప్రదాయ నిర్మూలనకు పాటుపడ్డారని, ఆయన సేవలు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2010లో రూ.5 విలువ పోస్టల్ స్టాంప్ ఆవిష్కరించిందన్నారు. అలాగే, రాష్ట్ర ముఖ్యమంత్రిగా జయలలిత వ్యవహరించిన సమయంలో అన్నాసాలైలో ఓమందూర్ రామస్వామి రెడ్డి పేరుతో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభించారని, బాలకృష్ణారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో అసెంబ్లీ హాలులో ఆయన ఫొటోను ఏర్పాటు చేశారని తెలిపారు.

బాణసంచా కర్మాగారంలో పేలుడు: ఇద్దరి మృతి

అడయార్, ఆగస్టు 25: దిండిగల్ జిల్లా నత్తం సమీపంలోని అవిచ్చిపట్టిలో బాణసంచా కర్మాగారంలో జరిగిన పేలుడులో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. అవిచ్చిపట్టికి చెందిన సెల్వం (50) తన మామిడితోపులో బాణసంచా కర్మాగారాన్ని నెలకొల్పగా, శివకాశికి చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఈ ఫ్యాక్టరీలో ఉన్నట్టుండి పేలుడు సంభవించింది. ఇందులో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని స్థానిక పోలీసులు ఆదివారం ఉదయం సందర్శించగా, అక్కడ చట్టవిరుద్ధంగా టపాకాయలు తయారు చేస్తున్నట్టు గుర్తించారు. పరారీలో ఉన్న సెల్వం కోసం గాలిస్తున్నారు.

ప్రమాదకర స్థితిలో ప్రయాణించం

● విద్యార్థులతో పోలీసుల ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పెరంబూర్, ఆగస్టు 25: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణిలోని డాక్టర్ రాధాకృష్ణన్ హయ్యర్ సెకండరీ బాలుర పాఠశాలలో తిరుత్తణి సహా చుట్టుపక్కల ఉన్న 25 గ్రామాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులు తమ గ్రామాల నుంచి ప్రభుత్వ బస్సుల్లో పాఠశాలకు వస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సుల్లో వెళ్లే విద్యార్థులు ఫుట్‌బోర్డు, కిటికీల పైకి ఎక్కి ప్రమాదకర స్థితిలో ప్రయాణిస్తూ ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. ఈ క్రమంలో, తిరుత్తణి డీఎస్పీ కందన్ ఉత్తర్వులతో తిరుత్తణి ఇన్‌స్పెక్టర్ మదియరసన్, ఎస్ఐ గుణశేఖర్ సిబ్బందితో శనివారం సాయంత్రం పలు మార్గాల్లో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఫుట్‌బోర్డు, కిటికీలపై ప్రయాణిస్తున్న విద్యార్థులను కిందకు దింపి, ఇకపై ప్రమాదకర స్థితిలో ప్రయాణించమని ప్రతిజ్ఞ చేయించారు.

'జిప్ లైన్' సాహసానికి పర్యాటకుల ఆసక్తి



జిప్ లైన్ సాహస విన్యాసాల్లో పర్యాటకులు

పెరంబూర్, ఆగస్టు 25: నీలగిరి జిల్లా గూడలూరు నాడుగాని బొటానికల్ కేంద్రంలో 'జిప్ లైన్' సాహసానికి పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. ఈ కేంద్రంలో బయోడైవర్శిటీ కన్జర్వేషన్ అండ్ క్లైమేట్ చేంజ్ పేరుతో తమిళనాడు గ్రీన్ స్కీం పథకంలో రూ.1.7 కోట్లతో అంతర్గత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా రూపొందించిన 'జిప్ లైన్ హ్యాంగింగ్' సాహసం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం, రుతుపవనాల ప్రభావంతో కమ్ముకున్న దట్టమైన మేఘాలు, చిరుజల్లుల ఆహ్లాదకర వాతావరణంలో పర్యాటకులు జిప్ లైన్ సాహస విన్యాసంలో పాల్గొంటున్నారు.

రూ.80 కోట్లతో వళ్లువర్‌కోట్టమ్‌కు సొబగులు

ఐసిఎఫ్, ఆగస్టు 25: స్థానిక నుంగంబాక్కం సమీపంలో ఉన్న వళ్లువర్‌కోట్టం పునరుద్ధరణ పనులు రూ.80 కోట్లతో జరుగుతున్నాయి. తిరువళ్లువర్ ఖ్యాతిని ప్రపంచానికి చాటేలా 1976లో నగరంలో దీన్ని ప్రారంభించారు. పర్యవేక్షణ లేక శిధిలావస్థకు చేరుకున్న వళ్లువర్‌కోట్టాన్ని ప్రాచీనత చెక్కు చెదరకుండా పునరుద్ధరించేందుకు ప్రభుత్వం రూ.80 కోట్లు కేటాయించింది. ఈ పనులు గత ఏడాది డిసెంబరు నుంచి జరుగుతున్నాయి. ఆధునిక వసతులతో అభివృద్ధి పనులు 90 శాతం పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జనవరి 15వ తేది తిరువళ్లువర్ దినోత్సవం రోజున దీన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు తెలిపారు.

బంగారు భవితకు పునాది విద్య

● ఆచార్య డాక్టర్ శ్రీనివాసులు మున్నా



శ్రీనివాసులు మున్నాను జ్ఞాపికతో సత్కరిస్తున్న గోపురం కుంకుమం అధినేత వైవీ హరికృష్ణ

ప్యారీస్, ఆగస్టు 25: ఎంత నేర్చినా, ఎంత వారులైన బంగారు భవిత కు పాఠశాల విద్య పునా దిలాంటిదని ఆంధ్రప్రదేశ్ నెల్లూరు నగరంలోని నారాయణి ఫార్మసీ కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు మున్నా అభివర్ణించారు. స్థానిక జార్జిటౌన్‌లోని ఎస్కేపీ కన్వెన్షన్ హాలులో ఆదివారం ఎస్కేపీడీ బాలుర పాఠశాలల 84వ వార్షిక పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. సంఘ అధ్యక్షుడు, గోపురం కుంకుమం సంస్థ అధినేత వైవీ హరికృష్ణ సారథ్యంలో సుమారు మూడు గంటలపాటు సాగిన ఈ కార్యక్రమంలో దాదాపు 400 మందికిపైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ అనుభవాలు నెమరవేసుకున్నారు. పాఠశాలల పాలక మండలి సభ్యులు ఎస్ఎల్ సుదర్శనం గౌరవ అతిథిగా విచ్చేసారు. ముందుగా వైవీ హరికృష్ణ మాట్లాడుతూ... శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ధర్మసంస్థ నిర్వహణలోని విద్యా సంస్థల అభివృద్ధికి తమ సంఘం కృషి చేస్తుందని యేటా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి, తమకు పాఠాలు బోధించి మంచి మార్గంలో నడిపించిన ఉపాధ్యాయులు, సీనియర్లను సత్కరిస్తున్నట్లు తెలిపారు.

రూ.27 లక్షల గంజాయి స్వాధీనం

అడయార్, ఆగస్టు 25: సేలం మీదుగా లారీలో తరలిస్తున్న రూ.27 లక్షల విలువైన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సేలం మీదుగా నాగపట్టణం, తిరువారూర్, పుదుచ్చేరిలకు లారీల్లో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో సేలం జిల్లా మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరోధక విభాగం పోలీసులు... ధర్మపురి జిల్లా సేలం - ఆరూర్ రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టగా, ఆ సమయంలో అటుగా వచ్చిన లారీని ఆపి తనిఖీ చేయగా, అందులో భారీ మొత్తంలో గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి విలువ రూ.27 లక్షలకుపైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి లారీ డ్రైవర్ సుకుమారన్ (34)తో పాటు మరో నలుగురిని అరెస్టు చేశారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

హోసూరు వద్ద ఒకే సమయంలో 13 వాహనాల ఢీ

ఐదుగురి మృతి

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరు పేరాండపల్లి జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం వరుసగా 13 వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో ఐదుగురు మృతి చెందారు. మరో పదిమంది గాయపడ్డారు. ఆ మార్గంలో వెళ్తున్న ఎనిమిది కార్లు, నాలుగు లారీలు, బస్సు అదుపుతప్పి వరుసగా ఢీకొన్నాయి. బస్సు, కార్లు లారీలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు ఆ స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరో 10 మంది తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్సలందుకుంటున్నారు. ఈ ప్రమాదం కారణంగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

తిరుచెందూర్ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

ప్యారీస్, ఆగస్టు 25: తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. శనివారం ధ్వజారోహణం పూజలతో ఈ ఆలయంలో వేడుకగా ప్రారంభమైన ఆవణి ఉత్సవాలు సెప్టెంబరు 4 వరకు 12 రోజులు నిర్వహించనున్నారు. ఆదివారం సెలవు రోజు, సోమవారం కృష్ణ జయంతి సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో తిరుచెందూర్‌కు చేరుకున్నారు. ఉదయం 4 గంటలకు ఆలయాన్ని తెరచి 4.30 గంటలకు విశ్వరూప దర్శనం, 6 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం పూజలు నిర్వహించారు. భక్తులు ఐదు గంటలు వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు.

'క్రెడిట్ లిమిట్' పేరిట రూ.24,700 మోసం

పెరంబూర్, ఆగస్టు 25: స్థానిక వాషర్‌మెన్‌పేట ఎంసీ రోడ్డుకు చెందిన కిషోర్‌కుమార్ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం కిషోర్ కుమార్ సెల్‌ఫోన్‌ను సంప్రదించిన వ్యక్తి, మీ క్రెడిట్ కార్డు లిమిట్ పెంచేందుకు ఈ బ్యాంక్ ఖాతా వివరాలు తెలపాలని కోరాడు. ఇది నమ్మిన కిషోర్, బ్యాంక్ వివరాలు పంపించగా, అతని మొబైల్‌కు ఓటీపీ వచ్చింది. అనంతరం అతని బ్యాంక్ ఖాతా నుంచి రూ.24,700 బదిలీ అయ్యాయి. దీంతో, దిగ్భ్రాంతి చెందిన కిషోర్, సదరు బ్యాంక్‌కు వెళ్లగా, అలాంటి మెసేజ్ ఏదీ తాము పంపలేదని, నగదు పోగొట్టుకున్నందుకు బ్యాంక్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. దీంతో, కిషోర్ అందజేసిన ఫిర్యాదుతో వాషర్‌మెన్‌పేట సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు.

విషమిచ్చి పులులను హతమార్చిన ముగ్గురి అరెస్ట్



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

పెరంబూర్, ఆగస్టు 25: నీలగిరి జిల్లా పందలూరు సమీపం పితర్‌కాడు అటవీ రేంజ్ పరిధిలోని ఓ ప్రైవేటు తేయాకు తోటలో ఈనెల 20వ తేది రెండేళ్ల మగ పులి, 9 ఏళ్ల ఆడ పులి కళేబరాలను అటవీ సిబ్బంది గుర్తించారు. ఆ ప్రాంతానికి కొద్ది దూరంలో అడవి పంది కళేబరాన్ని కూడా సిబ్బంది కనుగొన్నారు. అడవి పంది కళేబరానికి నిర్వహించిన పోస్టుమార్టంలో, విషం కలిపిన అన్నం, దుంపలు తిని అది మృతి చెందినట్లు తేలింది. అనంతరంపులుల కళేబరాలకు నిర్వహించిన పోస్టుమార్టంలో, వాటి కడుపులో అడవి పంది మాంసం ఉన్నట్టు గుర్తించారు. ఈ విషయంపై ఎస్టేట్ నిర్వాహకులు, అక్కడ పనిచేస్తున్న కార్మికులను పోలీసులు విచారించారు. ఆ సమయంలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ముగ్గురు కార్మికులు, తమ సెల్‌ఫోన్‌లో మృతిచెందిన అడవి పంది చిత్రాలుంచడం గుర్తించడంతో పాటు వారే అడవి పంది మృతికి కారణమని తెలిసింది. దీంతో, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సూర్యకాంత్ పరాక్, అమన్‌కోయిలా, సుప్రిత్‌నన్వార్‌ను అరెస్ట్ చేశారు.

కృపానంద వారియర్‌కు ఘననివాళి



వారియర్‌కి నివాళులర్పిస్తున్న కలెక్టర్

వేలూరు, ఆగస్టు 25: కృపానందవారియర్ 119వ జయంతి వేడుకలు ఆదివారం గాంగేయ నల్లూర్‌లోని వారియర్ జ్ఞాపకార్థ మండపంలో జరిగాయి. కలెక్టర్ సుబ్బులక్ష్మి వారియర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా సమాచార శాఖ తరపున ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఎగ్జిబిషన్ ప్రారంభించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో వేలూరు ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, ఉప మేయర్ సునీల్‌కుమార్, ఆలయ ట్రస్టీ పరమశివం, కార్పొరేషన్ కమిషనర్ జానకి, పీఆర్వో రాజప్రకాష్ సహా పలు శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

వీఐటీలో ఫొటో ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న ఆర్ఎస్ భారతి

వేలూరు, ఆగస్టు 25: వీఐటీ యూని వర్శిటీలో తమిళ ఇయక్కం ఆధ్వర్యంలో సోమవారం కలైంజర్ శతజయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీ ఆర్ఎస్ భారతి ఎగ్జిబిషన్ ప్రారంభించారు. కార్యక్రమంలో వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్, ఉపాధ్యక్షుడు సెల్వం, ఎమ్మెల్యేలు కార్తికేయన్, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్శిటీ నిర్వాహకులు మాట్లాడుతూ... సోమవారం నిర్వహించనున్న వేడుకల్లో రాష్ట్ర మంత్రులు దురైమురుగన్, ఏవీ వేలు, గాంధీ, ఎంపీలు కనిమొళి, మురసోలి సెల్వం, జగద్రక్షకన్, కదిర్ ఆనంద్, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, ఈశ్వరప్పన్, అమ్ములు, వేలూరు మేయర్ సుజాత, సినీ గేయరచయిత వైరముత్తు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

పాఠశాల నిర్వహణ కమిటీ ఎంపిక



వేలూరు, ఆగస్టు 25: కనియంబాడి సమీపం కమ్మవాన్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్వహణ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు శరవణన్ అధ్యక్షత వహించగా, ఎస్పీఓ సూపర్‌వైజర్, న్యాయవాది ఆరోగ్యదాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, స్వయం ఉపాధి బృందాల సభ్యులు, ఉపాధ్యాయులతో కూడిన 24 మందితో పాఠశాల నిర్వహణ కమిటీని ఎంపిక చేశారు. అనంతరం నూతన కమిటీ ప్రతిజ్ఞ చేసింది.

ఇన్నర్‌వీల్ క్లబ్ స్వర్ణోత్సవాలు



వేలూరు, ఆగస్టు 25: స్థానిక ఆక్సీలియం కళాశాల రోడ్డు సమీపంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ వేలూరు దక్షిణం-323 స్వర్ణోత్సవాలు జరిగాయి. వేడుకలకు ముఖ్యఅతిథిగా వీఐటీ యూనివర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్, ఇన్నర్‌వీల్ క్లబ్ 323 జిల్లా అధ్యక్షుడు ఫాతిమా నజీరా తదతితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ వేలూరు దక్షిణం 323 అధ్యక్షుడు అరుళ్‌ఆసి, సెక్రటరీ ప్రేమ దామోదరన్, కోశాధికారి లోకనాయకి దయానిధి, ఐఎస్ఓ వల్లి షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



వేలూరు, ఆగస్టు 25: స్థానిక కాట్పాడి ఆక్సీలియం కళాశాల 69వ వార్షిక క్రీడా పోటీలు కళాశాల మైదానంలో జరిగాయి. ఈ పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ మేరీజోసి రాణి అధ్యక్షత వహించారు. అకౌంటెన్సీ శాఖ అధ్యక్షుడు ఆంటోని ఆహ్వానం పలికారు. ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మలర్ పాల్గొని, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. తమిళ శాఖ లెక్చరర్ మీనాక్షి వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

లలిత కళా అకాడమీలో 'కళా ప్రదర్శన' ప్రారంభం



కళా ప్రదర్శన ప్రారంభోత్సవం

పెరంబూర్, ఆగస్టు 25: స్థానిక లలిత కళా అకాడమీలో కళా ప్రదర్శన ప్రారంభమైంది. 'ఆర్ట్ అఫిషి నిటీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫొటో ప్రదర్శన ఈనెల 31వ తేది వరకు జరగనుంది. ప్రముఖ చిత్రకారులు గాయతి రాజా, పట్టణ ప్రముఖులు ఇ.వెంకటాచలం, జి.అంకయ్య ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో సుమారు 70కి పైగా కళా చిత్రాలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రదర్శనలో కళా ప్రదర్శనపై డెమో నిర్వహించనున్నారు. వివరాలకు నెం.9840667195లో సంప్రదించవచ్చు.

కెప్టెన్ విజయకాంత్‌కు నడిగర్ సంఘం ఘన నివాళి



విజయకాంత్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నడిగర్ సంఘం నిర్వాహకులు

తమిళ చిత్రపరిశ్రమలో కరుప్పు ఎంజీఆర్‌గా అటు సినీ ప్రేక్షకులు, ఇటు రాష్ట్ర ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన నటుడు కెప్టెన్ విజయకాంత్. ఆయన 72వ జయంతి వేడుకలు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగాయి. ఇందులోభాగంగా, నడిగర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టి.నగర్‌లోని దక్షిణ భారత నటీనటుల సంఘం (నడిగర్ సంఘం) ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో సంఘ అధ్యక్షుడు, సినీ నటుడు నాజర్, ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్, ఉపాధ్యక్షులు పూచ్చి మురుగన్, కరుణాస్‌లతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులైన తలపాటి దినేష్, శ్రీమాన్, విఘ్నేష్, వాసుదేవన్, నామినేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు దాశరథి, ఖలీలుల్లా, ఇతర నటీనటులు, నడిగర్ సంఘం మేనేజర్ తామరాజ్ తదితరులు పాల్గొని విజయకాంత్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారంతా నడిగర్ సంఘం అభివృద్ధితో పాటు చిత్ర పరిశ్రమ పురోగతికి విజయకాంత్ చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు.

ఆరేళ్ల తర్వాత పియా బాజ్‌పాయ్ రీఎంట్రీ

చిత్రజ్యోతి

ఉత్తరప్రదేశ్ నుంచి కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన నటి పియా బాజ్‌పాయ్. ఆరేళ్ల తర్వాత మళ్లీ ఆమె కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఆరేళ్ల క్రితం ఏ.ఎల్.విజయ్ దర్శకత్వం వహించిన 'పొయ్ సొల్లపోరోమ్' ద్వారా ఆమె కోలీవుడ్‌కు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'ఏగన్', 'గోవా', 'బలే పాండియన్', 'కో', 'చట్టం ఒరు ఇరుట్టరై-2' చిత్రాల్లో నటించారు. 2018లో ఆమె నటించి విడుదలైన చిత్రం 'అభియుం నానుమ్'. ఆ తర్వాత ఆమెకు సరైన అవకాశాలు లేకపోవడంతో ఇండస్ట్రీకి దూరమయ్యారు. ఇప్పుడు 'మాయన్' లో ముగ్గురు హీరోయిన్లలో ఒకరిగా నటిస్తున్నారు. ఇందులో జాన్ విజయ్, ఆడుకలం నరేన్, సాయ్ దీనా, గంజా కరుప్పు, రాజ్ సిమ్మన్, శ్రీరంజని, రంజనా నాచ్చియార్, కేకే మీనన్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఎంఎస్ జోన్స్ రూబెర్ట్ సంగీతం. కె.అరుణ్ ప్రసాద్ ఛాయాగ్రహణం. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ ఫాంటసీ థ్రిల్లర్ జోనర్‌లో రూపుదిద్దుకుంది.



పియా బాజ్‌పాయ్

సెప్టెంబరులో విడుదలకు సిద్ధమైన 'పేట్ట రాప్'

● విడుదల హక్కులు సఫైర్ స్టూడియో సొంతం



'పేట్ట రాప్'లో ప్రభుదేవా, వేదిక

ప్రముఖ కొరియోగ్రాఫర్, సినీ దర్శకుడు, హీరో ప్రభుదేవా, వేదిక, సన్నీ లియోన్ నటించిన 'పేట్ట రాప్' తమిళనాడు థియేట్రికల్ రిలీజ్ రైట్స్‌ను ప్రముఖ కంపెనీ సఫైర్ స్టూడియో సొంతం చేసుకుంది. ఎస్.జె. సిను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని బ్లూ హిల్ ఫిలింస్ పతాకంపై జోబి బి సామ్ నిర్మించారు. ఈ సినిమాలోని ఇతర పాత్రల్లో రియాజ్ ఖాన్, రమేష్ తిలక్, భగవతి పెరుమాళ్, వివేక్ ప్రసన్న, కళాభవన్ షాజోన్ వంటి తారాగణం నటించారు. పీకే దినీల్ కథను సమకూర్చగా, జిత్తు దామోదర్ సినిమాటోగ్రఫీ అందించారు. ఈ చిత్రానికి సంబంధించి మోషన్ పోస్టర్‌తో పాటు రెండు పాటలు, టీజర్‌ను ఇప్పటికే విడుదల చేయగా వాటికి మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం అన్ని రకాల నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉన్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి డి.ఇమ్మాన్ సంగీతం.

గుమ్మడికాయ కొట్టేసిన '2కే లవ్‌స్టోరీ'



'2కే లవ్‌స్టోరీ' షూటింగ్ ముగింపు సెలెబ్రేషన్స్

ప్రముఖ దర్శకుడు సుశీంద్రన్ తాజాగా నిర్మించిన చిత్రం '2కే లవ్‌స్టోరీ'. ఈ సినిమా షూటింగ్ కేవలం 38 రోజుల్లోనే పూర్తి చేసింది. నేటితరం ప్రేమ కథగా రూపొందించారు. పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను కూడా శరవేగంగా పూర్తి చేసి విడుదల చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. తమిళ చిత్ర పరిశ్రమలో తనదైన విలక్షణమైన చిత్రాలతో అభిమానుల హృదయాలను కొల్లగొట్టిన దర్శకుడు సుశీంద్రన్ సుదీర్ఘ విరామం తర్వాత రొమాన్స్ జోనర్‌లో ఈ సినిమాను తెరకెక్కించారు. 2కే తరానికి చెందిన యువత ప్రేమ, స్నేహం, వారి జీవితాలను ప్రతిబింబించే విధంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమాలో జెగవీర్ ప్రధాన పాత్రలో నటించగా, మీనాక్షి గోవిందరాజన్ హీరోయిన్. వీరితో పాటు బాల శవరణన్, ఆంటోని భాగ్యరాజ్, జయప్రకాష్, వినోదిని, సింగముత్తు, జిబి ముత్తు తదితరులు ఇతర పాత్రలను పోషించారు. చెన్నై, కోయంబత్తూరు తదితర ప్రాంతాల్లో కేవలం 38 రోజుల్లో షూటింగ్ పూర్తి చేసుకుంది. డి.ఇమ్మాన్ సంగీతం సమకూర్చుతున్నారు. సుశీంద్రన్ - ఇమ్మాన్ కాంబినేషన్‌లో వస్తున్న పదో చిత్రం కావడం గమనార్హం. మూవీ ఫస్ట్‌లుక్‌తో పాటు టీజర్‌ను త్వరలోనే విడుదల చేయనున్నారు.



దక్షిణ భారత నటీనటుల సంఘం ఆధ్వర్యంలో విదేశాల్లో నిర్వహించ తలపెట్టిన సంగీత విభావరి కార్యక్రమ నిర్వహణపై అగ్ర నటుడు కమల్‌ను కలిసి చర్చలు జరిపి సూచనలు, సలహాలు స్వీకరించిన నడిగర్ సంఘ అధ్యక్షుడు నాజర్, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, కోశాధికారి కార్తీ.

తెలుగు భాష విలువను భావి పౌరులకు తెలియజేయాలి

● డాక్టర్ అజంతా కె.శంకర రావు ● విద్యార్థులకు బహుమతుల ప్రదానం



కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు భాషాభిమానులు - గోపికా పూర్ణిమకు జ్ఞాపికను బహూకరిస్తున్న అజంతా కె.శంకర రావు తదితరులు

అడయార్, ఆగస్టు 25: తెలుగు భాష విలువను భావి పౌరులకు తెలియజెప్పేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక సమితి అధ్యక్షుడు డాక్టర్ అజంతా కె.శంకర రావు పిలుపునిచ్చారు. సమితి ఆధ్వర్యంలో నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా తెలుగు భాషాదినోత్సవం, వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు పురస్కారాల పంపిణీ కార్యక్రమం ఆదివారం నగరంలో ఘనంగా జరిగింది. మైలాపూర్ లజ్ చర్చి రోడ్డులో ఉన్న ఆంధ్ర మహిళా సభ హాలు వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ నేపథ్య గాయని గోపికా పూర్ణిమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమితి తరఫున గత నెలలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన తెలుగు పాఠశాలలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులకు, ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు అజంతా కె.శంకర రావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, తెలుగు భాషాభివృద్ధి కోసం సమితి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. వ్యావహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తి తెలుగు భాష కోసం చేసిన సేవలను గుర్తు చేసుకోవాల్సిన అసరముందన్నారు. చెన్నపట్నంలో తెలుగు భాష కోసం సేవలందించిన మహనీయులు చాలామంది మరుగున పడ్డారన్నారు. డీఆర్‌బీసీసీసీ హిందూ కాలేజీ తెలుగు శాఖ సహాయాచార్యులు డాక్టర్ తుమ్మపూడి కల్పన మాట్లాడుతూ... తెలుగు భాషకు వెలుగునిచ్చే బాధ్యత విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. చక్కటి తెలుగులో మాట్లాడుతూ, తెలుగు భాష గొప్పతనాన్ని బాహ్య ప్రపంచానికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల విద్యాలయ విశ్రాంత కరస్పాండెంట్ జయశ్రీ, హోమియో డాక్టర్ అనంత పద్మనాభన్, ఆంధ్ర బాలానంద సంఘం కరస్పాండెంట్ దామెర్ల పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రూ.100 కోట్ల దిశగా పరుగులు తీస్తున్న 'తంగలాన్'



'తంగలాన్'లో విక్రమ్

చియాన్ విక్రమ్ - పా.రంజిత్ కాంబినేషన్‌లో వచ్చిన 'తంగలాన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఈ నెల 15న విడుదలైన ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా రూ.100 కోట్ల వసూళ్ల దిశగా పయనిస్తోంది. హీరో విక్రమ్ సినీ కెరీర్‌లోనే ఈ సినిమా ఓపెనింగ్ కలెక్షన్లలో ది బెస్ట్ మూవీగా నిలిచిన విషయం తెల్సిందే. తొలి రోజున ఏకంగా రూ.26 కోట్లకుపైగా కలెక్షన్లను రాబట్టి, ఇప్పటికీ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. తమిళనాట కంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఫలితంగా ఈ రెండు రాష్ట్రాల్లో కలిపి ఈ సినిమాను ప్రదర్శించే స్క్రీన్ల సంఖ్యను 141 నుంచి 391కు పెంచినట్టు నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ తెలిపింది. అలాగే, ఈ నెల 30నుంచి ఈ సినిమా హిందీ వెర్షన్‌ను విడుదల చేస్తున్నారు. దీంతో 'తంగలాన్' మరిన్ని రూ.కోట్ల వసూళ్లను రాబడుతుందని అంచనా వేస్తున్నారు. పార్వతి, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం. నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా.

నేడు కృష్ణ జయంతి నేతల శుభాకాంక్షలు

అడయార్, ఆగస్టు 25: శ్రీకృష్ణ జయంతి వేడుకలను పురస్కరించుకుని పలు రాజకీయ పార్టీల నేతలు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భగవద్గీత వంటి అద్భుత జ్ఞానగ్రంథాన్ని అవిష్కరించిన శ్రీకృష్ణ పరమాత్ముడు అవతరించిన రోజైన కృష్ణ జయంతిని జరుపుకునే రాష్ట్రప్రజలకు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాను అని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి పేర్కొన్నారు. అదే విధంగా వివిధ పార్టీలకు చెందిన నేతలతో పాటు శశికళ, టీటీవీ దినకరన్, ఎర్నావూర్ నారాయణన్, ఎంపీ శేఖర్ యాదవ్, తదితరులు వేర్వేరు ప్రకటనలో తమ శుభాకాంక్షలను తెలిపారు.

సీఎం స్టాలిన్‌తో కమల్ భేటీ



కమల్‌కు కరుణానిధి శతజయంతి స్మారక రూ.100 నాణేన్ని కానుకగా అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మక్కల్‌నీదిమయ్యం అధినేత కమల హాసన్ ఆదివారం ఉదయం డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్‌తో ఆకస్మికంగా భేటీ అయ్యారు. శనివారం మక్కల్ నీదిమయ్యం కార్యాచరణ మండలి సమావేశం జరిగిన నేపథ్యంలో కమల్ స్టాలిన్‌ను కలుసుకోవడం చర్చనీయాంశమైంది. చెన్నై క్యాంపు కార్యాలయానికి వెళ్లిన కమల్ మంగళవారం విదేశీ పెట్టుబడుల సమీకరణ కోసం సీఎం స్టాలిన్ జరుపతలపెట్టిన అమెరికా పయనం విజయవంతం కావాలంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కరుణానిధి శతజయంతి స్మారక రూ.100 నాణేన్ని కమల్‌కు స్టాలిన్ కానుకగా అందజేశారు. కమల్ తనను కలుసుకోవడం గురించి స్టాలిన్ ఎక్స్‌పేజీలో ఓ సందేశం పొందుపరిచారు.

28న కంచి ఉలగళంద పెరుమాళ్ ఆలయ మహాకుంభాభిషేకం



ఆలయ రాజగోపురం, ఉలగళంద పెరుమాళ్

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాంచీపురంలోని సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం ఉలగళంద పెరుమాళ్ ఆలయ మహాకుంభాభిషేకం ఈనెల 28న అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఆలయం అష్టోత్తర శత దివ్యదేశాలలో ఊరగత్తాన్ సన్నిధి, కారకత్తు పెరుమాళ్ సన్నిధి, నీరగత్తు పెరుమాళ్ సన్నిధి, కార్వణపెరుమాళ్ సన్నిధి అంటూ నాలుగు దివ్యదేశాల సన్నిధులు కలిగిన ఏకైక దేవాలయం. తిరుమళిసై ఆళ్వార్ తన కీర్తనల ద్వారా ఈ ఆలయ వైభవాలను ఎలుగెత్తి చాటారు. ఇంతటి విశేషాలను సంతరించుకున్న ఈ ఆలయ కుంభాభిషేకం 2007లో నిర్వహించారు. 2019లో ఈ ఆలయ కుంభాభిషేకం నిర్వహించాల్సి ఉండగా వివిధ కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ ఆలయానికి మహా కుంభాభిషేకం నిర్వహించేందుకు ఆలయ అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. ఉలగళంద పెరుమాళ్ సన్నిధి, ఆరణవల్లి తాయార్ సన్నిధి, రాజగోపురం, విమానాలను మరమ్మతులు చేసి వాటికి కొత్త రంగులు హంగులు సమకూర్చారు. ఈ జీర్ణోద్ధరణ పనులన్నీ ముగియనుండటంతో 17 యేళ్ల తర్వాత ఈ ఆలయ మహాకుంభాభిషేకం ఈనెల 28 ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. కుంభాభిషేకం ఏర్పాట్లలో భాగంగా ఆలయ ప్రాంగణంలో యాగశాలలు, ఆరు యాగ గుండాలను నిర్మించే పనులు జరుగుతున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి రాజమాణిక్యం, ఆలయ ట్రస్టీలు అప్పన్ అళగియ సింగర్, గోమఠం రవి, పేరాగత్తి భట్టర్ రఘురామ్ ఈ ఏర్పాట్లను చేపడుతున్నారు.

శ్రీ ఆంధ్ర కళా స్రవంతిలో కృష్ణాష్టమి వేడుకలు



కళాకారులతో జేఎం నాయుడు, జీవీ రమణ, కేఎం సురేష్‌బాబు తదితరులు

ప్యారీస్, ఆగస్టు 25: కృష్ణాష్టమిని పురస్కరించుకొని స్థానిక కొరట్టూరు అగ్రహారంలోని శ్రీ ఆంధ్ర కళా స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉట్టి, శ్రీ కృష్ణ పూజ, ఒడిస్సా క్లాసికల్ డాన్స్, తమిళ జానపద నృత్యం, మిమిక్రీ, కామెడీ, ఒడిస్సా సంబల్‌పురి ఫోక్ డాన్స్, గరగాట్టం, కళాకారుల సన్మానం తదితర కార్యక్రమాలు కనువిందు చేశాయి. రాధాకృష్ణుల వేషధారణ, వివిధ సాంస్కృతిక పోటీల్లో పాల్గొని గెలుపొందిన విజేతలకు స్రవంతి అధ్యక్షుడు జే.ఎం. నాయుడు, కోశాధికారి జీ.వీ.రమణ, నిర్వాహకులు కేఎన్ సురేష్‌బాబు, బి.రాజేంద్రన్, ఇ.బాలాజి, డి.మనోహరన్, వీఎన్ హరినాథ్, ఎమ్మెస్ నాయుడు, ఇ.కుమార్ సహా సభ్యులు బహుమతులు అందజేశారు. వేడుకల్లో భాగంగా ఆంధ్రా వంటకాలతో విందు ఏర్పాటు చేశారు.

● ఎట్టెళుత్తు పెరుమాళ్ ఆలయ కృష్ణాష్టమి వేడుకలు

అందంగా తయారవుతున్న కుండలు



ఓ కుండపై గోపాలుడి బొమ్మకు మెరుగులు దిద్దుతున్న కళాకారుడు

చెన్నై, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం తిరునల్వేలి నగరంలోని అరుకన్‌కుళం ఎట్టెళుత్తు పెరుమాళ్ ఆలయంలో కృష్ణజయంతి వేడుకలకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనే భక్తుల కోసం రంగురంగుల మట్టి పాత్రలను అందంగా తయారు చేస్తున్నారు. ఈ మట్టి పాత్రలలో భక్తులకు స్వీట్లు, ఫలహారాలను పంపిణీ చేయనున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం ఐదువేలకు పైగా చిన్న సైజు మట్టి పాత్రలను తయారు చేసి వాటిపై రంగులతో శ్రీకృష్ణుడు, సత్యభామ, రుక్మిణి బొమ్మలను చిత్రీకరిస్తున్నట్టు చెప్పారు. ఇదేవిధంగా పెద్ద సైజు కుండలను భక్తులకు విక్రయించనున్నామని కూడా తెలిపారు.



కుండలపై కృష్ణుడి బొమ్మలను పెయింట్ చేస్తున్న కళాకారులు

వీనులవిందుగా వీణానాదం



గురుస్వామి భక్తవత్సలాన్ని సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, ఆగస్టు 25: తిరువళ్లూర్ జిల్లా పెరియపాళయం సమీపంలోని ఆర్యపాక్కంలో ఉన్న శ్రీ విద్యారంభ జ్ఞాన మహాసరస్వతి ఆలయం, జై సరస్వతి ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వీణానాదం వీనులవిందుగా సాగింది. స్థానిక టి.నగర్ పిట్టి త్యాగరాయ హాలులో శనివారం రాత్రి 7 గంటలకు జ్యోతి ప్రజ్వలన, ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి సరస్వతి ఆలయ ధర్మకర్త డాక్టర్ పొన్నూరు వేంకటకృష్ణారావు అధ్యక్షత వహించారు. ఆలయం తరఫున ఆంధ్ర బాలు రాము, శాంతి సురేష్, మణిమాలరావు.. సరస్వతీదేవిని కీర్తిస్తూ శ్రావ్యంగా ఆలపించిన 'సరస్వతి నమస్తుతే' ఆల్బం ఆవిష్కరించారు. ఆత్మీయ అతిథిగా ప్రముఖ నటీమణి సీత, ప్రత్యేక ఆహ్వానితులుగా పీవీఆర్ కృష్ణారావు, తంగుటూరి రామకృష్ణ, జైరాజ్ ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ తాడేపల్లి రాజశేఖర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వీణానాదం పేరుతో నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచిన నలుగురు సీనియర్లు, నలుగురు జూనియర్ కళాకారులకు నగదు బహుమతిగా రూ.28,000, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో భాగంగా 49 ఏళ్లుగా తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న గురుస్వామి భక్తవత్సలాన్ని ఘనంగా సత్కరించారు. సరస్వతి ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా నూతనంగా నియమించిన ట్రస్టీలు అజంతా డాక్టర్ కనిగెలుపుల శంకరరావు, ముక్కాల భాష్యకారులు, లక్ష్మీనారాయణ, కుబేంద్రన్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ మోహనశ్రీ, శోభారాజా, తాడేపల్లి జయశ్రీ రాజశేఖర్‌తో పాటు, ప్రముఖ పారిశ్రామికవేత్త నల్లికుప్పుసామి చెట్టి, కూచిపూడి, భరతనాట్య కళాకారులు, ప్రముఖ సంగీత దర్శకుడు డాక్టర్ జె.శ్రీను బాబు, నాట్యరత్న, కలైమామణి జె.సూర్యనారాయణ మూర్తి, తెలుగు తరణి మ్యూజిక్ బృందం సభ్యులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కళాకారుల వీణానాదం, ఆధ్యాత్మిక సంకీర్తనలు, పద్యాలు, భక్తిగీతాలు, కూచిపూడి, భరత నృత్యాలతో అలరించిన ఈ కార్యక్రమం, తేజారావు వందన సమర్పణతో ముగిసింది.



పళనిలో రెండు రోజులపాటు నిర్వహించిన ప్రపంచ ముత్తమిళ్ మురుగన్ మహానాడు ఆదివారం రాత్రి ముగిసింది. పళనియాండవర్ ఆర్ట్స్ కళాశాల మైదానంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల ఆధ్యాత్మిక మహానాడులో కళాకారిణులు సుబ్రహ్మణ్యస్వామి లీలావిశేషాల నృత్య ప్రదర్శనతో అలరించారు. తమిళ సంప్రదాయ వస్త్రధారణలో విదేశీ వనితలు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు భారతి భాస్కర్, సుకి శివంకు జ్ఞాపికలను అందజేశారు. - చెన్నై